యథేచ్ఛగా ఎర్రమట్టి దందా


వడ్డేపల్లి గుట్ట నుంచి ట్రాక్టర్లలో తరలిస్తున్న ఎర్రమట్టి

- తరిగిపోతున్న గుట్టలు, తిప్పలు
- అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టపగలే మట్టి ట్రాక్టర్ల మోత

శాంతినగర్: ఎర్రమట్టి తరలింపు మండల పరిధిలో యథేచ్ఛగా సాగుతోంది. రాత్రి, పగలు అడ్డూ అదుపు లేకుండా తరలింపు జరుగుతోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు రోడ్డుపై తిరగడం, ట్రాక్టర్ల మోతతో భయాందోళన చెందుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

ట్రాక్టర్లలో తరలింపు

వడ్డేపల్లి మండలం తనగల గుట్ట నుంచి ప్రతినిత్యం సుమారు 70 ట్రాక్టర్లతో ఎర్రమట్టి తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. గుట్టను జేసీబీలతో తవ్వుతు ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్నారు. పట్టపగలే యథేచ్ఛగా మట్టిని తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గుట్టలు, తిప్పలు కరుమరుగవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.


తనగల గుట్ట నుంచి ట్రాక్టర్లలో తరలిస్తున్న ఎర్రమట్టి

ప్రభుత్వ ఆదాయానికి గండి

ఎర్రమట్టిని తరలించాలంటే మైనింగ్ శాఖకు రుసుం చెల్లించి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. నేరుగా గుట్టలు తవ్వడం, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ, భయపెడుతూ అడ్డూ అదుపు లేకుండా దందా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్లక్ష్యంగా అధికారులు

తనగల గుట్ట నుంచి ఎర్రమట్టి తరలిస్తున్నారని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని ఎమ్మార్వో, పోలీసులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రకృతి సంపద పరులపాలు కాకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖ అధికారులు స్పందించి ఎర్రమట్టి తరలింపును అడ్డుకోవాలని పేర్కొంటున్నారు.

ట్రాక్టర్ల మోత

పదుల సంఖ్యలో ఎర్రమట్టిని ట్రాక్టర్లతో ఒకేసారి తరలిస్తున్నారు. రోడ్లపై అధిక వేగంతో వెళ్లడంతో ప్రజలు భయపడుతున్నారు. గుట్టలు, కొండలు తవ్వి యర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని మట్టి తరలింపును అడ్డుకోవాలి.

– ఆంజనేయులు, కిష్టాపురం, అయిజ

గుట్ట కనుమరుగవుతుంది

తనగల గుట్ట నుంచి ప్రతి నిత్యం వందల క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టి తరలిస్తుండటంతో ఇప్పటికే సగం వరకు గుట్ట తరిగిపోయింది. అధికారులు చర్యలు తీసుకోకపోతే గుట్ట కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

– తిమ్మప్ప, తనగల, వడ్డేపల్లి

అనుమతులు లేవు

తనగల గుట్ట నుంచి ప్రతినిత్యం ఎర్రమట్టి తరలింపునకు ఎలాంటి అనుమతులు లేవు. గతంలో ఇందిరమ్మ ఇళ్లకు మాత్రం మట్టి ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో అనుమతులు ఇచ్చాం. ప్రస్తుతం ఉన్నతాధికారులు, మైనింగ్ శాఖ నుంచి అనుమతులు లేవు.

– శ్రీకాంత్‌రెడ్డి, డీటీ

క్లుప్తంగా

స్కూల్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలి



గట్టు: స్కూల్ ఆటో బోల్తా పడిన ఘటనకు సంబంధించి ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ గద్వాల నియోజకవర్గ అధ్యక్షుడు బండారి రాజు, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు బండారి సునంద్ అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణను వినతి పత్రం అందజేశారు. మండలంలోని ఆరగిద్ద గ్రామానికి చెందిన ప్రైవేటు స్కూల్ ఆటోలో 20 మంది చిన్నారులను సల్కాపురం నుంచి తీసుకెళ్తుండగా బోల్తా పడిన సంఘటనలో చిన్నారులు త్రుటిలో ప్రాణాపాయం తప్పిందన్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్య తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చింతరేవుల సురేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటో ఎక్స్‌పో పోస్టర్ విడుదల



అయిజ: ఈ నెల 19, 20, 21తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శాంతినగర్ సీఐ టాటాబాబు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జ్యోతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండలంలోని ఫొటో, వీడియోగ్రాఫర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



అయిజ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, అనుమతి పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కేసులు నమోదు చేశారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతే సమాజాభివృద్ధి



రాజోళి: బాలికలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందితేనే సమాజం వృద్ధి చెందుతుందని చైల్డ్ వెల్ఫేర్ ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ.. విద్యార్థులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి తెలియజేయాలన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో మెడికల్ అధికారి డాక్టర్ మధుబాబు, శివలీల, సరోజ, చిట్టెమ్మ పోలీసు సిబ్బంది తదిదరులు పాల్గొన్నారు.

మండల సమాఖ్య సమావేశం



అయిజ: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సమాఖ్యలోని గ్రామ సంఘ వీఓఏల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఏపీఎం జయాకర్ మాట్లాడారు. మహిళా శక్తి పథకాల ద్వారా చేపట్టే అన్ని కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేయాలన్నారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మాసమ్మ, కోశాధికారి జనార్ధనమ్మ, సీసీలు సుదర్శనం, ఆంజనేయులు, అకౌంటెంట్ స్వర్ణలత, వీఓఏలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టండి



అయిజ: పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీలోని భరత్‌నగర్ కాలనీలో వర్షం నీరు రోడ్లపై నిలిచి ఏర్పడిన మురుగు గుంతలను బీజేపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడారు. మున్సిపాలిటీలోని అన్ని కాలనీల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్, రఘు, ఖుషి, భీష్మాచారి, రాజా, వినోద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ భవిష్యత్

గట్టు: క్రమశిక్షణతో చదివితేనే ఉత్తమ భవిష్యత్ ఉంటుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహ అన్నారు. శుక్రవారం గొర్లఖాన్‌దొడ్డిలో పొలం పనులు చేస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పొలాల్లో కలసి అవగాహన కల్పించారు. 8 మంది విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించారు. బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్, ఉపాధ్యాయుడు రంగస్వామి, వలంటీర్ కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా ఉత్తమ గణిత ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్న సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సుందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు హేమలత, ఉపాధ్యాయులు నరేష్, మహమ్మద్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

సేవా కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

గట్టు: గ్రామీణ ప్రాంతాల్లోని సమగ్ర సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌టీఐ మైండ్‌ట్రీ ప్రతినిధి లలిత కోరారు. శుక్రవారం పెంచికలపాడులో ఏర్పాటు చేసిన సమగ్ర సేవా కేంద్రం, పేపర్ ప్లేట్ మిషన్‌ను స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. కేంద్రాల్లో అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో రాజశేఖర్, సురేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణపై అవగాహన

గద్వాల: మహిళల భద్రత, హక్కుల పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సఖీ వన్‌స్టాప్ సెంటర్ నిర్వాహకులు అరుణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జమ్మిచేడులో అత్యవసర సహాయ సేవలు, పోలీసు న్యాయ సహాయం, వైద్య సహాయం, సైకోషోషియో కౌన్సిలింగ్ తాత్కాలిక నివాస సదుపాయం వంటి సేవలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వాతి, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న బాసు హనుమంతునాయుడు

ధరూరు: జిల్లా కేంద్రంలో శనివారం జరిగే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గర్జన సభకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాసు హనుమంతునాయుడు కోరారు. శుక్రవారం స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్‌తో కలిసి కాంపౌండ్ నర్సింహారెడ్డి గృహంలో సమావేశమై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. శనివారం సాయంత్రం గద్వాల పాత బాస్టాండ్‌లో జరిగే సభా కార్యక్రమానికి పెద్ద ఎత్తున జన సమీకరణ చేయాలని సూచించారు. గ్రామ, గ్రామాన కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి తరలి రావాలన్నారు. కార్యకర్తలకు ఇబ్బంది కలుగకుండా మండల ఇన్‌చార్జ్‌లు బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజారెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, మోనేష్, సీతారాములు, వెంకటేష్ నాయుడు, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కేటీదొడి: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గర్జన భారీ బహిరంగ సభ పోస్టర్లను మాజీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, బీఆర్‌ఎస్ ఇంచార్జ్ బాసు హనుమంతునాయుడు మండల కేంద్రంలో విడుదల చేశారు. అనంతరం కొండాపురం గ్రామంలో మాజీ సర్పంచ్ మోహన్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చక్రధర్, రాఘవేందర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అరుణజ్యోతి

అలంపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. పట్టణంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో ఐద్వార రాష్ట్ర అధ్యక్షురాలు మాట్లాడుతూ.. 2009లో సంభవించిన వరదల్లో ప్రజలు సర్వం కోల్పోయారన్నారు. 15 సంవత్సరాలు గడిచినా వరదల్లో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. గతంలో వరద బాధితులకు న్యాయం చేస్తామని ప్లాట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కానీ నిర్వాసితులకు ఇప్పటి వరకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సేవలు గ్రామీణ ప్రాంత ప్రజలకు అందడం లేదన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్యులను, సిబ్బందిని నియమించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు ఏమేలమ్మ, కార్యదర్శి నర్మద, జిల్లా కమిటీ సభ్యులు దేవమ్మ, మదనమ్మ, మాధవి, సమీరా, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవ చేసేందుకు పిలుపు


కేటీదొడ్డిలో మాట్లాడుతున్న స్నిగ్ధారెడ్డి

కేటీదొడ్డి/అయిజ: యువత, మేధావులు దేశ సేవ చేసేందుకు బీజేపీ పిలుస్తోందని పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. కేటీదొడ్డిలో గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన సేవా పక్వాడ కార్యక్రమంలో ఆమె హాజరై మాట్లాడారు. దేశ ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 17న మోదీ జన్మదినం సందర్భంగా ప్రతి మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించాలని, ప్రతి శిబిరంలో 78 మంది తగ్గకుండా రక్తదానం చేయాలని సూచించారు. 18న మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆత్మనిర్భర భారత్ వికసిత్ భారత్ అంశాలపై చిత్రలేఖనం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

- భారత ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇతర దేశాల ప్రధానులు మెచ్చుకుంటున్నారని బీజేపీ అయిజ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులు సేవా పక్షం కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అఖిలపక్షం కమిటీ నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు భీమసేన్‌రావు, వెంకటేష్, గిడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి ఏచూరి


మానవపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు

రాజోళి/మల్దకల్/ఉండవెల్లి/మానవపాడు: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. రాజోళి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటి నాగప్ప, లక్ష్మన్న, కృష్ణ, దస్తగిరి తదిదరులు పాల్గొన్నారు.

- మల్దకల్ బస్టాండ్ చౌరస్తాలో సీపీఎం జిల్లా నాయకుడు నర్సింహ్మ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి వర్ధంతి నిర్వహించారు.
- ఉండవెల్లి మండల కేంద్రంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీఐటీయూ నాయకులు పూలమాలలు వేసి నివాలర్పించారు.
- మానవపాడు మండల కేంద్రంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధించాలి


అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ తరగతులపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్లు

మల్దకల్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన అందించాలని జిల్లా రిసోర్స్ పర్సన్లు భాస్కర్ పాపన్న, అక్షిత్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం అమరవాయి జెడ్పీహెచ్‌ఎస్‌లో జీహెచ్‌ఎం నరేష్ ఆధ్వర్యంలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాన్ అకాడమీ సౌజన్యంతో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న డిజిటల్ తరగతుల బోధన ప్రపంచ స్థాయిలో నాణ్యమైన విద్యను పొందే అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. గణితం, సైన్స్ సబ్జెక్ట్‌లో ఐఎఫ్‌పీ ప్యానల్ బోర్డులు, కంప్యూటర్ల ద్వారా అంశాలను నేర్చుకునే అవకాశాలు కల్పించాలన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు సమీక్షించి మెరుగైన విద్యను అందించేందుకు ప్రణాళిక బద్ధంగా విద్యా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రదీప్‌కుమార్, ఉపాధ్యాయులు రాధిక, విజయలక్ష్మి, నర్సింహ్మారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, క్రాంతికుమార్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

హిందీపై మక్కువ పెంచుకోవాలి


అమరవాయిలో ప్రదర్శనలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

మల్దకల్: మండల పరిధిలోని అమరవాయి, బిజ్వారం, ఎల్కూరు, మల్దకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లలో హిందీ భాష దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 14న జాతీయ హిందీ భాష దినోత్సవం సందర్భంగా కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు నరేష్ మాట్లాడుతూ.. మాతృభాషలో ప్రావీణ్యం సంపాదించడమే కాకుండా హిందీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. హెచ్‌ఎం నరేష్, క్రాంతికుమా ర్, నర్సింహ్మాస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

గద్వాలన్యూటౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల వద్ద ఈ నెల 15న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న బిగ్ డిబేట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. సర్కార్ నిర్లక్ష్య ధోరణి కారణంగా విద్యా రంగం సంక్షోభంలో మునిగిపోయిందన్నారు. బకాయిలు విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, తిరుమల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన గ్రామపాలన అధికారులు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా పరిధిలో శుక్రవారం గ్రామపాలన అధికారులు ఆయా గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు ఆర్డర్ కాపీలు అందజేశారు. మానవపాడులో తహసీల్దార్ జోషి శ్రీనివాస్ శర్మ, మల్దకల్‌లో తహసీల్దార్ ఝాన్సీరాణి 8 మందికి, ఉండవెల్లిలో తహసీల్దార్ ప్రభాకర్ 5 మందికి, ఇటిక్యాలలో తహసీల్దార్ వీరభద్రప్ప నలుగురు అధికారులకు ఆర్డర్ కాపీలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది వారికి అభినందనలు తెలియజేశారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

గద్వాల: జిల్లా కేంద్రంలోని చింతలపేట, మద్రాస్‌పేట వార్డుల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ మున్సిపల్ అధికారులను కోరారు. శుక్రవారం వార్డుల్లో పర్యటించి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని నర్సింహ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మల్దకల్: అక్రమంగా రాయచూర్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని బిజ్వారం గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. అమరవాయికి చెందిన ఎరుకలి జయన్న శుక్రవారం సాయంత్రం బిజ్వారంలో లబ్ధిదారుల నుంచి రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యం విక్రయించి ఆటోలో రాయచూర్‌కు తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు.

కోడిపందెం స్థావరాలపై దాడులు

అయిజ: మండలంలోని ఎక్లాస్‌పురం శివారులో శుక్రవారం కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. నలుగురిని అదుపులోకి తీసుకొని 3 సెల్‌ఫోన్లు, రూ.3,750 నగదు, 11 బైకులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

కేటీదొడ్డి: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలతో సమావేశం నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి పనులపై ఆరా తీశారు. అనంతరం కుచినెర్లలోని హార్టీకల్చర్, పౌల్ట్రీ ఫాంను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణారావు, ఎంపీఓ కృష్ణమోహన్, ఏపీఓ కుమార్ తదితరుల పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



గద్వాలన్యూటౌన్: నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆరోపించారు. శుక్రవారం స్థానిక గ్రంథాలయం వద్ద గ్రూప్–1 అభ్యర్థులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. గ్రూప్–1 పరీక్ష నిర్వహణలో పబ్లిక్ సర్వీస్ కమీషన్ విఫలమైందదన్నారు. దీనికి నైతిక బాధ్యత చైర్మన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా గ్రూప్– 1 పరీక్షను రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్, సుప్రీంకోర్టుకు వెళ్లకుండా, అభ్యర్థులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేష్, మాధవ్, కిరణ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి

ఇటిక్యాల: పశువులకు సంక్రమించే లంపీస్కిన్ (ముద్దచర్మవ్యాధి) నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాంచాలని పశువైద్యుడు వినయ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొగిళిరావులచెర్వులో పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల్లో ముద్దచర్మ వ్యాధి ఈగలు, దోమలు మొదలైన పరాన్నజీవుల ద్వారా సంక్రమిస్తుందన్నారు. జ్వరంతో పాటు చర్మం కింద గుల్లలు, ముద్దలుగా గడ్డలు కట్టి కళ్లు, ముక్కు నుంచి స్రవాలు కారుతాయన్నారు. వ్యాధి బారిన పడినపుడు నొప్పి నివారణ, అంటిహిస్టమైన్ టీకాలు వేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలమిత్ర రాజేంద్ర పశు పోషకులు తదితరులు పాల్గొన్నారు.

పఠనాసక్తికి గ్రంథాలయాల ఏర్పాటు



ఇటిక్యాల: విద్యార్థుల్లో పఠనాసక్తి, నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాట్లు అని ఎంఈఓలు వెంకటేశ్వర్లు, అమీర్‌పాష అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మునగాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. జాతీయ నాయకుల జీవిత చరిత్ర, నీతికథల పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు పుస్తకాలు చదవడాన్ని అలవాటు చేయాలన్నారు. దాతల సహకారంతో గ్రంథాలయాలు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఉదయ్‌కిరణ్, ఉపాధ్యాయులు తిమ్మప్ప, రవి, వినోద్, మోహన్, తదితరులు పాల్గొన్నారు.